క్లుప్తంగా

సీఐటీయూ ఆధ్వర్యంలో బస్తీబాట


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

రామగిరి: ఆర్జీ–3 ఏరియా సెంటినరికాలనీ కార్మిక క్వార్టర్లలో ఆదివారం సీఐటీయూ నాయకులు బస్తీబాట కార్యక్రమం చేపట్టారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకున్నారు. క్వార్టర్‌లో కుక్కలు, కోతులు, పందుల బెడద నివారించాలని పలు కార్మిక కుటుంబాలు సీఐటీయూ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త సమస్యలు తెలపగా సీఐటీయూ నాయకులు సివిల్ డీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక కుటుంబసభ్యులు ఆరుబయట చెత్త వేయొద్దని, పరిసరాల పరిశుభ్రతకు ప్రతీఒక్కరు తోడ్పడాలని కోరారు. బ్రాంచి కార్యదర్శి డి.కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు బిగింపు

సుల్తానాబాద్: రాజీవ్ రహదారిపై కెనాల్ వద్ద, రైస్‌మిల్ అసోసియేషన్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదాల నియంత్రణకు హెచ్‌కేఆర్ కాంట్రాక్టర్ సిబ్బంది ఆదివారం హైమాస్ట్ లైట్లు బిగించారు. ఈ ప్రాంతంలో మూలమలుపులు ఉండడంతో పాటు వాహనాల రద్దీ ఉంటుంది. హైమాస్ట్ లైట్ల బిగింపుతో ప్రమాదాల నియంత్రణకు తోడ్పడుతుంది.

ప్రమాదకరంగా గుంత



కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్–సుల్తానాబాద్ ఆర్‌అండ్‌బీ రహదారిపై పెగడపల్లి రైతు వేదిక సమీపంలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. వాహనవారులు రాత్రి పూట, ఎదురుగా ఏదైనా వాహనం వస్తే గుంత కనిపించక పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు గుంత పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ


ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను గుర్తు చేస్తూ స్థానిక సెక్రెట్ హార్ట్ పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఆదివారం సైకిళ్లపై హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ


రేషన్ కార్డులతో లబ్ధిదారులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో ఆదివారం కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్, గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య, మండల కన్వీనర్ మహేశ్వరరావుతో కలిసి నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొత్త రేషన్‌కార్డులు అందుకున్న వారు వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నాగరాజు, రాజేశ్వరరావు, యాదగిరి, మొగిలి, సురేశ్, పోతరాజు, రామ్, రవీందర్ పాల్గొన్నారు.

పేదింటి యువతి పెళ్లికి ఆర్థికసాయం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో నిరుపేద పెసరు రాజేశం కూతురు అఖిల వివాహానికి నేనున్నా స్వచ్ఛంద సంస్థ తరఫున రూ.5వేలు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ అందించారు. సంస్థ సభ్యులు తొగరు శ్రీనివాస్, కొండపల్లి కృష్ణమూర్తి, అంజయ్య, రాజు, పెసరు కనుకయ్య, మల్లయ్య, రాకేశ్ ఉన్నారు.

నేడు బీజేపీ నిరసన దీక్ష

కమాన్‌పూర్: మండల ప్రజా సమస్యలపై బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ మండల నాయకులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చేపట్టే నిరసన దీక్షలో మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నాళ్లీ గేటు తిప్పలు

- పెద్దంపేట రైల్వేగేట్‌తో ఇబ్బందుల్లో ఆరు మండలాల ప్రజలు
- అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాలేని పరిస్థితి
- ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్


గేటు వేసి ఉండడంతో నిరీక్షిస్తున్న వాహనదారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట రైల్వే ప్రధాన గేటు (ఎల్‌సీ–52)తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరు మండలాలకు కనెక్టివిటీ ఉన్న రైల్వేగేటు మీదుగా రాకపోకలు సాగించేందుకు గ్రామీణ ప్రజలు తిప్పలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం రాలేక గేటు బయట వరకే వచ్చి సిద్ధంగా ఉండడంతో రోగిని గేటు బయటకు తీసుకొచ్చి అంబులెన్స్‌లో ఎక్కించాల్సిన దుస్థితి నెలకొంది. ఢిల్లీ–చెన్నై గ్రాండ్ రూట్‌గా పరిగణించే ప్రధాన రైల్వేలైనులో గేట్ల రహితంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొంటున్న దక్షిణ మధ్య రైల్వే కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీరోజు 120పైగానే రైళ్ల రాకపోకలు..

గ్రాండ్ రూట్‌గా పరిగణించే ఈ ట్రాక్ మీదుగా ప్రతీరోజు 120రైళ్లకు పైగా రాకపోకలు సాగిస్తాయి. రైల్వే గేటు ఐదు నిమిషాలు తెరిచి ఉంటే 20 నిమిషాలు వేసి మూసి ఉండడంతో ఇరువైపులా వందలాది వాహనాలు గేటు వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే గేటు మీదుగా అంతర్గాం, పాలకుర్తి, ధర్మారం, ధర్మపురి, ఎండపల్లి, వెల్గటూర్, పెగడపల్లి, జగిత్యాల తదితర మండలాల ప్రజలు ఈ మార్గం గుండా వెళ్తారు. వ్యవసాయ కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, కల్లుగీత కార్మికులు రైల్వేగేటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్‌లోనే 60శాతం ఆదాయం

ఇక్కడి నుంచే..

సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో బొగ్గు ఎగుమతులతో రామగుండం కేంద్రంలో డివిజన్‌కు సమకూరే ఆదాయంలో 60శాతం పైగా ఇక్కడి నుంచే సమకూరుతుంది. ఎగుమతుల్లో జాప్యం జరగకుండా రైల్వే శాఖ బైపాస్ లైన్లు ఏర్పాటు చేస్తుండగా, పలుచోట్ల రైల్వేగేట్లను ఎత్తివేసి అదే చోట భూగర్భ, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం చేపడుతోంది. కానీ పెద్దంపేట, కుందనపల్లి, కన్నాల రైల్వేగేట్ల ఎత్తివేతకు మాత్రం మోక్షం కలగడం లేదు.

సమయం వృథా



మా గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంతర్గాం మండల కేంద్రానికి వెళ్లాలంటే రైల్వేగేటు మీదుగా వెళ్లాలి. వెళ్లి రావడానికి రెండు గంటల సమయం పడుతోంది. సమయం వృథా అవుతోంది. భూగర్భ వంతెన నిర్మిస్తే రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. వంతెన నిర్మాణ విషయమై ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టిసారించాలి. – గడ్డం మధుగౌడ్, పెద్దంపేట

వంతెన నిర్మాణం తప్పనిసరి



మా గ్రామంలోని వందలాది మంది గీత కార్మికులు ఉన్నారు. ఈత, తాటివనాలన్నీ రైల్వే ట్రాక్ అవతలిపక్కనే ఉంటాయి. ఫలితంగా తెల్లవారుజాము నుంచి గీత కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రైల్వే ట్రాక్ మీద ఆగి ఉన్న రైలు కింద నుంచి వెళ్తుండగా ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. పెరిగిన రద్దీ దృష్ట్యా వంతెన నిర్మాణం తప్పనిసరి. – ఆముల శ్రీనివాస్, పెద్దంపేట

గేట్ల సమస్యలు చర్చించా



ఇటీవల సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన డివిజనల్ సమావేశంలో పెద్దంపేట, కుందనపల్లి రైల్వేగేట్ల వద్ద భూగర్భ, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ పెట్టాం. కుందనపల్లి వంతెన టెండర్ ప్రక్రియలో ఉండగా పెద్దంపేటపై దృష్టిపెట్టారు. దీనిపై ఎంపీతో చర్చించి రైల్వే జీఎంపై ఒత్తిడి తీసుకువస్తా. – అనుమాన శ్రీనివాస్, డీఆర్‌యూసీసీ ప్రతినిధి

వాకింగ్‌కు వీలులేకుండా మైదానం



మైదానంలో మట్టి పోయడంతో నిలిచిన నీరు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పాత గదులు కూల్చివేసిన మట్టిని పోశారు. వర్షం నీరు నిలుస్తోందని మట్టి పోయడంతో మరింత బురద అవుతోందని వాకర్స్ వాపోతున్నారు. వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు సైతం నడవకుండా చేశారన్నారు. వాకర్స్‌కు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు

జూలపల్లి: గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరాలు తీర్చుకునేలా నిర్మించాల్సిన సామాజిక మరుగుదొడ్లు ఊరికి దూరంగా నిర్మించారు. దీంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతోంది. దీనికి తోడు నిర్వహణ పట్టించుకోకపోవడంతో దుర్వాసన వచ్చి, ప్రజలెవరూ ఉపయోగించుకునేందుకు విముఖత చూపుతున్నారు. ఇప్పటికైనా నీరు అందుబాటులో ఉంచి, పరిశుభ్రత పాటించేందుకు పంచాయతీ సిబ్బంది చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పేరు లేని రైల్వేస్టేషన్

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.కోట్లాది నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టిన అధికార యంత్రాంగం కనీసం ఊడిపోయిన బోర్డును పునరుద్ధరించ లేదు. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఏ రైల్వేస్టేషన్ అనేది గుర్తించలేకపోతున్నారు. రైల్వేస్టేషన్‌ను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అధికారులు రెండునెలల క్రితం భారీ ఈదురుగాలులు, వర్షాలకు రైల్వేస్టేషన్ బోర్డు సగానికి విరిగిపోయింది. ప్రారంభోత్సవానికి ముందే విరిగిన బోర్డు అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి బోర్డును తొలగించారు. రెండు నెలలైనా కనీసం రైల్వేస్టేషన్‌కు ఊరు పేరు బోర్డు బిగించకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఊరు పేరుతో బోర్డు బిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ కమిటీ మండల అధ్యక్షుడిగా అనిల్

కమాన్‌పూర్: ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండి అనిల్, ఉపాధ్యక్షుడిగా బర్ల సది, ప్రధాన కార్యదర్శిగా దబ్బెట సంతోష్, కోశాధికారిగా జంగిలి పోశాలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, సుబ్రమణ్యం, వడ్లకొండ తిరుపతి, తోట శ్రీనివాస్, సందవేన నాగరాజు, రమేశ్, సంపత్, నాగరాజు, కుమార్, సతీశ్, చింటు, నారి, సుధాకర్, గణేశ్, చందు, అనిల్ పాల్గొన్నారు.

తాజొద్దీన్‌బాబా దర్గాలో పూజలు



గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని తాజొద్దీన్ బాబా దర్గాలో ఆదివారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి, మక్కాన్ సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ తాజొద్దీన్‌బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్రగా కొండగట్టుకు


పాదయాత్రగా బయలుదేరిన స్వాముల బృందం

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కురుమపల్లికి చెందిన హనుమాన్ మాలధారణ భక్తులు ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వాములు ఊరేగింపుగా హనుమాన్ నామస్మరణ చేస్తూ పాదయాత్ర ప్రారంభించారు. మేకల సంతోష్, జడల శ్రీనివాస్, బీటి అశోక్, గొర్రె రమేశ్, మ్యాడగోని తిరుపతి, కదారి హరీశ్, బేతి శివరాజు, కొయ్యడ సందీప్, ఓర్సు మల్లేశ్, వేల్పూరి లక్ష్మణ్, మేరుగువేన ఓదెలు, బీటి శేఖర్, జోగుల తిరుపతి, కూరపాటి శంకర్, పెండ్యాల ప్రశాంత్, బండారి రాజశేఖర్, సందవేన చంద్రమౌళి, జడల అంజయ్యతో పాటు దాదాపు 30మంది స్వాములు పాదయాత్రగా కొండగట్టుకు వెళ్లారు.

కనుల పండువగా బీమన్నస్వామి పట్నాలు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీమన్న ఆలయంలో పట్నాలు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు స్వామివారికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పట్నాల్లో పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ విసారపు వెంకటేశం, మాజీ సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, నాయకులు కొత్త మధు, మల్లేశం, చందు, దోర్ల రవి, లచ్చయ్య, శ్రీధర్, మాదాసు రవి, మున్నూరుకాపు కుల సంఘం సభ్యులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోదావరిఖని టౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఆద్య బాంకెట్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు సూర్యదేవర వెంకటేశ్వర్లు, జ్యోతి, లక్ష్మి, స్వరూప్‌చంద్, పుష్పవేణి, శ్రీనివాస్, యూసుఫ్, తిరుపతి, మొగిలి, కిషన్‌రావు, ఐలయ్య, శంకర్, ప్రేమ్, పూర్వ విద్యార్థులు వీరాసింగ్‌ఠాకూర్, వనిత, వెంకటేశ్, తిరుపతి, నాగరాణి, సూరజ్ పాల్గొన్నారు.



కమాన్‌పూర్: మండలంలోని గుండారం బస్టాప్ నుంచి పిల్లిపల్లె మీదుగా కమాన్‌పూర్ మండల కేంద్రానికి వెళ్లే రహదారి వెంట ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మూలమలుపుల వద్ద దారికి ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు దారిపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది రెండు బైక్‌లు ఢీకొనడంతో గుండారం గ్రామానికి చెందిన లక్కాకుల శ్రీనివాస్ అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానిలు తెలిపారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

విశాల్‌కు ఆవోపా గోల్డ్‌మెడల్ మెరిట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న విశాల్

ఎలిగేడు: కరీంనగర్ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ (ఆవోపా)గోల్డ్ మెడల్ మెరిట్ అవార్డును మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి విశాల్ అందుకున్నాడు. కరీంనగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశాల్‌కు పాలిసెట్‌లో ప్రతిభ కనబచినందుకు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల హెచ్‌వోడీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ వంగల శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. విశాల్‌కు అవార్డు రావడంపై ఎలిగేడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆవోపా అధ్యక్షులు నలుమాసు సుదర్శనం, ప్రధాన కార్యదర్శి వొల్లాల సత్యనారాయణ, కోశాధికారి కట్కూరు చంద్రశేఖర్, మెరిట్ అవార్డు కన్వీనర్ అక్కినపల్లి శివజ్యోతినాగరాజు, భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం



రామగుండం: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి నిత్యం బురదమయం కావడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రహదారి మరీ అధ్వానంగా మారింది. ప్రత్యామ్నాయంగా మరో రహదారి మీదుగా రాకపోకలు సాగించడంతో దూరభారం పెరుగుతోందంటున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి క్షేత్ర పరిశీలన చేసి సత్వరమే ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మేడిపల్లి పీఏసీఎస్‌లో సాఫీగా యూరియా సరఫరా


వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు


మేడిపల్లి సహకార సంఘానికి చేరిన యూరియా బస్తాలు

రామగుండం: రామగుండం నియోజకవర్గ పరిధిలో ఉన్న మేడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని రైతులకు సరిపడా యూరియా విడతల వారీగా సరఫరా చేస్తున్నామని సంఘం చైర్మన్ మామిడాల ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని కార్యాలయంతో పాటు పాలకుర్తి మండలంలో ఈసాల తక్కళ్ళపల్లి, కుక్కలగూడూర్, అంతర్గాం మండల పరిధిలో గోలివాడ గ్రామాల్లో సబ్‌సెంటర్లు తెరిచి రైతులకు సరఫరా చేస్తున్నారు. రైతులు సంఘంలో సభ్యత్వంతో సంబంధం లేకుండా ముందుగా తమ పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. జూన్ నుంచి ఇప్పటివరకు 9వేల బస్తాలు సరఫరా చేసినట్లు చైర్మన్ పేర్కొన్నారు. సంఘంలో 3,040 మంది రైతులకు సభ్యత్వం ఉండగా, 872 మంది రైతులకు రూ.8కోట్ల మేరకు స్వల్పకాలిక రుణాలు, 30 మంది రైతులకు రూ.60లక్షల దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసినట్లు కార్యదర్శి వైద్య రమేశ్ వెల్లడించారు.

ఓపెన్ జిమ్ నిర్వహణపై పట్టింపు కరువు

- విరిగిన పరికరాలు
- పట్టించుకోని అధికారులు




సుల్తానాబాద్: పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కోసం పురపాలక అధికారులు పలు వార్డుల్లో రూ.లక్షల వ్యయంతో పబ్లిక్ పార్కులు, వాకింగ్ ట్రాకుల వద్ద, చెరువు కట్టల మీద, వివిధ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్ సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటి నిర్వహణ కొరవడి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో జిమ్‌కు సంబంధించిన పలు పరికరాలు విరిగిపోతున్నాయని క్రీడాభిమానులు, వాకర్లు చెప్తున్నారు. వెంటనే వాటికి మరమ్మతు ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.